తెలంగాణలో ఎల్ లిల్లీ హబ్

- రూ.9 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన అమెరికా కంపెనీ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కంపెనీ ప్రతినిధుల కీలక చర్చలు

ఎల్ లిల్లీ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మరోసారి ప్రపంచం దష్టిని ఆకర్షించింది. ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎల్ లిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. అందుకు అవసరమయ్యే ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ.9000 కోట్లు) భారీ పెట్టుబడులకు కంపెనీ ముందుకొచ్చింది. ఈ నిర్ణయంతో ఎల్ లిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎల్ లిల్లీ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎలి లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, లిల్లీ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సిఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ చర్చల అనంతరం ఎల్ లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్షరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ ప్రకటించింది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎల్ లిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్వర్క్ సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. కొత్త హబ్ ఏర్పాటుతో మన రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలు చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాకు చెందిన ఎల్ లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెట్టనుంది. ప్రధానంగా డయాబెటిస్, ఓబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎల్ లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి. హైదరాబాద్లో ఈ ఏడాది ఆగస్ట్ లోనే గ్లోబల్ కెపాబులిటీ సెంటర్ ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా ఎల్ లిల్లీ కంపెనీ బారీ పెట్టుబడులకు ముందుకు రావటం ఆనందంగా ఉందని, తెలంగాణకు ఇదొక గర్వ కారణమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణపై నమ్మకం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మ హబ్ గా పేరొందిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1961లో ఐడిపిఎల్ స్థాపించినప్పటి నుంచే హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారిందని, ప్రస్తుతం 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని గుర్తు చేశారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఎల్ లిల్లీ కంపెనీ విస్తరణ తెలంగాణలో పరిశ్రమల విస్తరణ తీరును ప్రతిబింబిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని అన్నారు. ఎల్ లిల్లీ విస్తరణ ఫార్మా రంగానికి కొత్త ఉత్తేజం అందిస్తుందని, ఇప్పటికే లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ వేగవంతమైన వృద్ధి సాధిస్తోందని అన్నారు.

జస్టిస్ బిఆర్ గవాయిపై దాడి దిగ్భ్రాంతికరం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయిపై న్యాయవాది కిషోర్‌దాస్ చెప్పు విసిరి దాడి చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడి దిగ్భ్రాంతికరమని తెలిపింది. అతన్ని వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ పరిధిలో రాజ్యాంగానికి అనుగుణంగా న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు తీర్పులివ్వడం, వ్యాఖ్యానాలు చేసే వైఖరి ఉంటుందని తెలిపారు. కానీ మనువాద, మతోన్మాద, ఆధిపత్య ధోరణులకు, సనాతన ధర్మానికి, లేదా ఇతర మతాలకు అనుకూలమైన రీతిలో తీర్పులుండాలనే రెచ్చగొట్టే వైఖరి సరైందికాదని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అనుసరిస్తున్న వైఖరి వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక శక్తులను అవమానించే ఘటన అని తెలిపారు. కుల అసమాతనలు, మతోన్మాద రాజకీయాలు, మూఢ విశ్వాసాన్ని పెంచి పోషించే విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తన భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నదని పేర్కొన్నారు. గతంలో బిజెపి నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూడా సిద్ధిపేట జిల్లాలో కొంత మంది ఆధిపత్య కులాల న్యాయవాదులు ఇలాంటి అవమానకరమైన వ్యాఖ్యానాలు చేశారని తెలిపారు. గాంధీని హత్యచేసి హంతకులైన ఆర్ఎస్ఎస్‌ను ఈనాడు దేశ భక్తులుగా స్వాతంత్ర్య దినోత్సవం రోజే వారిని దేశ ప్రధానమంత్రే కీర్తిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి ఘటనలకు భయపడే సమస్య లేదంటూ ప్రధాన న్యాయమూర్తి చెప్పడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులన్నీ, సామాజిక న్యాయం కోరే, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడే శక్తులన్నీ ఐక్యంగా నిలబడి పోరాడాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు కూడా ఇలాంటి దాడులను సంఘటితంగా వ్యతిరేకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టిబి నిర్మూలనలో భాగస్వాములు కండి

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిబిని పూర్తిగా నిర్మూలించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన 76వ టిబి సీల్ సేల్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదరికం, పౌష్టికాహారం, అవగాహనలతో ముడిపడి నేటికి సామాజిక సవాలుగా మారిన టిబి ప్రధాన ఆరోగ్య సమస్యగా ఉందని ఆయన గుర్తుచేశారు. దీని నిర్మూలనగా యువత, కళాకారులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్లు, విద్యా సంస్థలు కలిసికట్టుగా ప్రయత్నించాలని సూచించారు. టీబీపై అవగాహన, పరీక్షలు, పౌష్టికాహార సహకారం, పరిశోధనల విషయంలో ట్యూబరోక్లోసిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ చేస్తున్న కృషిని గవర్నర్ అభినందించారు. ఎక్స్‌రే మిషన్లను విరాళంగా ఇచ్చేందుకు కార్పొరేట్లు ముందుకు రావాలని ఆయన కోరారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్, టిబి అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి డి బాలచంద్ర, జాయింట్ డైరెక్టర్ (టిబి) డాక్టర్ ఎ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

సిజెఐపై దాడికి నిరసనగా నేడు రాష్ట్రవ్యాప్త నిరసనలు

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై ఆర్ఎస్ఎస్‌కు చెందిన న్యాయవాది రాకేష్ కిషోర్ దాడికి పాల్పడండం దుర్మార్గమనీ, దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం అన్ని జిల్లా కేంద్రాల్లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని మోడీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం ముసుగులో దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులోనే సీజేఐపై భౌతిక దాడికి పాల్పడటం దేశ చరిత్రలోనే చీకటి రోజు అని ఆందోళన వ్యక్తం చేశారు.

సిజెఐ బిఆర్ గవాయ్‌పై మనువాదుల దాడి : తెలంగాణ గిరిజన సంఘం

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మనువాద శక్తుల దాడి అమానుషమని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మత ఉగ్రవాది రాకేష్ కిషోర్ అనే న్యాయవాది తన బూటు విసిరి దాడికి పాల్పటం దుర్మార్గమని విమర్శించారు. రాజ్యాంగాన్ని గౌరవించే ప్రజాస్వామ్యవాదులు, లౌకిక శక్తులు ఈ దాడిని ఖండించాలని విజ్ఞప్తి చేశారు.

దేశ ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి దుర్మార్గం
ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పైకి న్యాయవాది ముసుగులో ఉన్న మతోన్మాది కిషోర్ దాస్ చెప్పు విసిరి దాడికి పాల్పడడాన్ని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు ఎండి జబ్బార్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిజెఐపై దాడి అత్యంత హేయమైనదనీ, న్యాయవ్యవస్థకు, దేశానికి అవమానమని భావ ప్రకటన స్వేచ్ఛ, రాజ్యాంగంపై దాడి అని తెలిపారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్రం విఫలం

- సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు
- నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జాతీయ సదస్సు

మాట్లాడుతున్న సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలమైందని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు అన్నారు. కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో రెండో రోజు సోమవారం తెలంగాణ శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ దేశంలోని 50 కోట్ల మంది కార్మికులకు పని, సామాజిక భద్రత, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రోజురోజుకూ దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, గంటకు 50 కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లాలో ఆశా వర్కర్‌పై లైంగికదాడి, హత్య జరిగినా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. ఇలాంటి కేసులను విచారించే పద్ధతుల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. 100 కేసులకు సుమారు 27 కేసుల్లో మాత్రమే శిక్షలు పడుతున్నాయని, దోషులకే ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయని విమర్శించారు. లైంగిక వేధింపుల చట్టం 2013ను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి సత్వరమే శిక్షలు విధించడం ద్వారా ఈ కేసుల సంఖ్యను తగ్గించే అవకాశముందన్నారు.

కేరళ రాష్ట్రంలోని కమ్యూనిస్టు ప్రభుత్వం మాత్రమే పని ప్రదేశాల్లో మహిళలకు కనీస సౌకర్యాలు అమలు చేస్తోందని చెప్పారు. రాత్రి సమయాల్లో కూడా మహిళా ఆరోగ్య సిబ్బంది విధులను నిర్వర్తిస్తుంటారని, వీరి కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తోందని విమర్శించారు. నవంబర్ 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో అఖిల భారత శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు సాయిబాబు తెలిపారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు 25 రాష్ట్రాలకు చెందిన సుమారు 400 మంది కార్మిక నాయకులు హాజరు కానున్నట్టు తెలిపారు. సిఐటియు జాతీయ అధ్యక్షులు కె.హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, ఆలిండియా వర్కింగ్ ఉమెన్ కన్వీనర్ ఎకె సింధు ఈ సదస్సుకు హాజరవుతారని చెప్పారు. సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఆర్.త్రివేణి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి పద్మశ్రీ, ఉపాధ్యక్షులు భూపాల్, కోశాధికారి వంగూరు రాములు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వి.రమ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి.ఆనంద్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.రాజేందర్, ముంజం శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు కూశన రాజన్న, దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, ముంజం ఆనంద్‌కుమార్, గొడిసెల కార్తీక్, గెడం టీకానంద్, కృష్ణమాచారి, జిల్లా కార్యదర్శి ఆర్.మహేష్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, దిగిడ బక్కన్న పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదల

- నవంబర్ 11న పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. రాజస్థాన్, పంజాబ్, జమ్మూకాశ్మీర్, మిజోరాం, జార్ఖండ్, ఒడిశా అసెంబ్లీతోపాటు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికకు సంబంధించిన పోలింగ్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో కలిసి నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు, ఏర్పాట్లపై వివరించారు. ఈనెల 13న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. కోట్ల విజయబాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో 21 తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 22న నామినేషన్లను పరిశీలిస్తామని చెప్పారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 24 చివరి తేదని తెలిపారు. నవంబర్ 11న పోలింగ్, 14న లెక్కింపు ఉంటుందన్నారు. 16తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 139 లోకేషన్స్‌లో, 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, 38మంది సెక్టార్ అధికారులతోపాటు 2400 పోలీస్ ఇతర శాఖలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల, వీవీ ప్యాట్ యంత్రాలను వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ యంత్రాలను ఇప్పటికే పరిశీలించామన్నారు. ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డు (ఇపిఐసీ)తో పాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, ప్యాన్ కార్డు, పెన్షన్ పత్రం వంటి గుర్తింపు పత్రాలతో ఓటు వేయొచ్చని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తమకు ఉన్న క్రిమినల్ నేపథ్య వివరాలను పత్రికలు, టీవీ, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రకటించడం తప్పనిసరని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫేక్ న్యూస్‌లను వైరల్ చేయొద్దని, ఏదైనా ఉంటే నిర్ధారించుకుని వార్తలను ప్రసారం చేయాలని అన్నారు.

వెపన్స్ డిపాజిట్ చేయాలి : హైదరాబాద్ సిపి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని హైదరాబాద్ సిపి సజ్జనార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తే కేసులు తప్పవన్నారు. ఎన్‌బిడబ్ల్యు కేసులపై స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. పాతనేరస్థులు, రౌడీషీటర్లపై దృష్టిసారిస్తామని, వెపన్స్ ఉంటే డిపాజిట్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ సిపి ఎక్బాల్, అదనపు డిసిపి నర్సింహారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

21 వరకు నామినేషన్ల స్వీకరణ, నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13, నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21 , నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22 , నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 24, పోలింగ్ తేదీ: నవంబర్ 11, ఓట్ల లెక్కింపు : నవంబర్ 14,

పెంచిన ఆర్‌టిసి ఛార్జీలను ఉపసంహరించాలి

- ప్రజలపై భారాల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెంచిన ఆర్‌టిసి బస్సు ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలని, ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ గోల్కొండ చౌరస్తా బస్టాప్ వద్ద పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది నెలల కిందటే ఆర్‌టిసి బస్‌పాస్ ధరలను పెంచారని, ప్రస్తుతం బస్సు ఛార్జీల పెంపు నిర్ణయం అన్యాయమని అన్నారు. ప్రజానీకంపై భారాలు మోపే నిర్ణయాలు ప్రజా రవాణాను బలహీన పరుస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం క్రమంగా ఆర్‌టిసి ప్రయివేటీకరణ చర్యలు చేపడుతోందన్నారు. ఇప్పటికే ఎలక్ట్రికల్ బస్సులను అద్దె బస్సులుగా మారుస్తూ ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రస్తుతం ఆర్‌టిసి కార్గో సర్వీసులను ప్రయివేటు సంస్థలకు అప్పగించే చర్యలు కొనసాగుతున్నట్టు వార్తలు వస్తున్నాయన్నారు. ఇలాంటి ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించి ఆర్‌టిసి సంస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల ఉచిత రవాణా ఫలితంగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది కానీ దానికి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నగరంలో రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.అరుణ జ్యోతి, నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరథ్, ఎం.మహేందర్, నాయకులు ఆర్.వెంకటేష్, జి.నరేష్, ఎం.అజయ్ బాబు, ఎన్.మారన్న, జి.కిరణ్ పాల్గొన్నారు.

జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి అనాగరికం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ దాడి అనాగరికమని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సుప్రీం కోర్టు హాల్‌లో వాదనల సందర్భంగా రాజేశ్‌కిషోర్ అనే న్యాయవాది బూటును గవాయ్‌పైకి విసిరి దాడి చేయడం, బెదిరింపులకు పాల్పడటం న్యాయవాద వృత్తిలో ఉండి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పూనుకోవడం క్షమించరాని నేరమని తెలిపారు.

స్కూళ్ల బకాయిలు విడుదల చేయాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే 25 వేలకుపైగా విద్యార్థులకు సంబంధించిన రూ.180 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్రసమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేండ్లుగా ఆ బకాయిలను విడుదల చేయకపోవడంతో వాటిలో చదివే విద్యార్థులను బడులకు రావొద్దంటూ యాజమాన్యాలు లేఖలు రాశాయని తెలిపారు. దీంతో 25 వేల మందికిపైగా ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు పాఠశాలలకు రాకుండా ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని విమర్శించారు.

తెలంగాణలో ప్రీమియం ఉత్పత్తులకు డిమాండ్

- అమెజాన్ వెల్లడి

హైదరాబాద్: తమ సంస్థ ఇటీవల ప్రారంభించిన అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2025లో తెలంగాణలో ప్రీమియం ఉత్పత్తులకు ఎక్కువ డిమాండ్ లభిస్తోందని అమెజాన్ ఇండియా తెలిపింది. సెప్టెంబర్ 22 నుంచి ప్రారంభమైన ఈ సేల్‌లో స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, హోమ్ అండ్ కిచెన్ భారీ డిమాండ్ కనిపించిందని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్‌లపై 40 శాతం వరకు, ఎలక్ట్రానిక్స్ అండ్ ఫ్యాషన్‌పై 80 శాతం వరకు డిస్కౌంట్‌లు కొనసాగుతున్నాయని తెలిపారు. "తెలంగాణ కస్టమర్లు ప్రీమియం టివిలు, ఆభరణాల నుంచి రోజువారీ అవసరాల వరకు ఆన్‌లైన్ షాపింగ్‌లో ఎక్కువ కొనుగోళ్లు జరిపారన్నారు.

10 నుంచి నారెడ్కో ప్రాపార్టీ షో

- హైటెక్స్‌లో ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

రియల్ ఎస్టేట్ డెవలపర్ల ఆసోసియేషన్ నారెడ్కో ఈ నెలలో మూడు రోజుల పాటు ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తోన్నట్లు తెలిపింది. అక్టోబర్ 10 నుండి 12 వరకు నగరంలో హైటెక్స్‌లో 15వ ఎడిషన్ నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో ఉంటుందని నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడు విజయ సాయి మేకా తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది వివిధ రకాల కొనుగోలుదారుల అవసరాలను తీర్చడానికి నివాస, కార్యాలయ వాణిజ్య, రిటైల్ వాణిజ్యంతో సహా ఆస్తులను ఇక్కడ తమ భాగస్వాములు ప్రదర్శించనున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రగతిశీల విధానాలు, స్థిరమైన సంస్కరణల కారణంగా నగరం ఐటి, ఐటిఇఎస్, ఫార్మా, ఏరోస్పేస్, ఏవియేషన్, ఆటో మొబైల్స్, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో స్థిరమైన జోరును చూస్తోందన్నారు. కొనుగోలుదారుల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా పరిష్కారాలను అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రాపర్టీ షోను ఏర్పాటు చేస్తోన్నామన్నారు. నరెడ్కో తెలంగాణ సెక్రటరీ జనరల్ కె శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. "15వ ఎడిషన్ నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో గృహ కొనుగోలుదారుల విభిన్న అవసరాలను తీర్చే విస్తృత శ్రేణి ఆస్తులను ఒకచోట చేరుస్తుంది. పండుగ సీజన్ సమీపిస్తున్నందున కాబోయే కొనుగోలుదారులు తమ కలల ఆస్తిని అన్వేషించడానికి, ప్లాన్ చేయడానికి, పెట్టుబడి పెట్టడానికి ఇది అత్యంత అనుకూలమైన సమయం." అని అన్నారు.

విదేశీ బాండ్ల జారీకి సాంప్రే న్యూట్రిషన్స్ ఆమోదం

న్యూఢిల్లీ : మిఠాయి తయారీదారు అయిన సాంప్రే న్యూట్రిషన్స్ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు ఇటీవల జరిగిన సమావేశంలో నాలుగు కోట్ల డాలర్ల (రూ.355 కోట్లు) విలువైన విదేశీ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్ల జారీకి ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఒక్కొక్కటి 1 లక్ష డాలర్ల విలువైన 400 విదేశీ కన్వర్టేబుల్ బాండ్ల (ఎఫ్‌సిసిబి)లను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ నిధులను ఈజిప్ట్, లైబీరియా మార్కెట్లలో విస్తరించడానికి ఉపయోగించనున్నట్లు వెల్లడించింది.

గవాయిపై దాడిని ఖండించిన మంత్రి సీతక్క



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయిపై జరిగిన దాడి ఘటనను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది క్షణికావేశంలో జరిగిన దాడి కాదనీ, పథకం ప్రకారం కుట్రపూరితంగా చేసిన దాడి అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు భారత రాజ్యాంగానికి కస్టోడియన్ అనీ, ఆయనపై దాడి అంటే రాజ్యాంగంపై చేసినట్టేనని తెలిపారు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దానిపై దాడి చేయడం భారత ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఇలాంటి దాడులు దేశ ప్రతిష్టను దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం అందరికీ సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలను ప్రసాదించిందనీ, ఆ విలువలను కాపాడటం ప్రతి పౌరుడి కర్తవ్యమని ఆమె పిలుపునిచ్చారు.

సచివాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు

- ఆర్థికశాఖలో ఆయనదే ఆధిపత్యం...
- ఉన్నతాధికారి అరాచకత్వం..
- ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారంటూ ఆరోపణలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత ప్రభుత్వ అప్పులు, వడ్డీలతో సతమతమవుతూ.. 'ఎలాగోలా' బండిని లాగించేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వానికి ఓ ఉన్నతాధికారి పక్కలో బల్లెంలా మారారు. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, వ్యవహారశైలి సర్కారుకు తలనొప్పిగా మారాయి. ఒకరకంగా ఆయన తన ఒంటెద్దు పోకడలతో రాష్ట్ర ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గవర్నమెంట్‌కు అత్యంత ప్రధానమైన ఆర్థికశాఖలో 'కీ'లక పోస్టులో ఉన్న ఆ ఉన్నతాధికారి... అటు ముఖ్యమంత్రి కార్యాలయాన్నిగానీ, ఇటు మంత్రుల ఆఫీసులను గానీ లెక్క చేయటం లేదని తెలిసింది. వివిధ పథకాలు, స్కీములకు సంబంధించి ఆయా కార్యాలయాల నుంచి వచ్చే సిఫారసులను సైతం ఆయన తొక్కిపడుతుండటంలో క్షేత్రస్థాయిలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివిధ శాఖలకు చెందిన అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పలు బకాయిలు సర్కారుకు గుదిబండగా మారాయి. మాజీ సర్పంచుల బిల్లులు, వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఫీల్ట్ అసిస్టెంట్ల వేతనాలు, గ్రామ కార్యదర్శులకు ఇవ్వాల్సిన రూ.104 కోట్లు ఇందులో కీలకంగా ఉన్నాయి. అయితే వీటిని నూటికి నూరు శాతం కాకపోయినా ఎంతోకొంత విడుదల చేయాలంటూ ఆయా శాఖల మంత్రులు, ముఖ్య కార్యదర్శులు ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. 'పెండింగ్ బిల్లుల గురించి ఆలోచించండి, సాధ్యమైనంత త్వరగా వాటిని క్లియర్ చేయండి...' అంటూ ఆయన ప్రస్తుతమున్న 'కీ'లక ఉన్నతాధికారికి కొన్ని నెలల క్రితమే ఆదేశాలిచ్చారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో తమతమ డిపార్టుమెంట్లకు ఎంతో కొంత నిధులు విడుదలవుతాయని మంత్రులు, ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, డైరెక్టర్లు ఆశించారు. కానీ వారి ఆశలపై నీళ్ల చల్లుతూ సదరు ఉన్నతాధికారి నెలల తరబడి అధికారులను, ఐఎఎస్‌లనూ తన ఛాంబర్ చుట్టూ తిప్పుకుంటున్నారు. ఆయన చుట్టూ ప్రదక్షిణాలు చేయలేక కొంతమంది ఐఎఎస్‌లు...'నిధులు వచ్చినప్పుడే వస్తాయి...ఆర్థికశాఖ చుట్టూ ఎన్నిసార్లు తిరుగుతాం.. అలసిపోయాం...' అంటూ చేతులెత్తేస్తున్నారు. డబ్బులు విడుదల కాకపోవటంతో కిందిస్థాయి నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోలేని ఓ సీనియర్ మంత్రి...'కార్యదర్శిగారూ.. మీరు ఆర్థికశాఖ వద్దకు వెళ్లి, కాస్త మన శాఖకు చెందిన పెండింగ్ బిల్లులు విడుదలయ్యేలా చూడండి...' అంటూ ఆదేశించారని సమాచారం. దానికి ఆ కార్యదర్శి...'మినిష్టర్ గారూ.. నాకూ ఆత్మాభిమానం ఉంటుందిగా..ఎన్నిసార్లని ఆర్థికశాఖ గడప తొక్కమంటారు, అక్కడ సాటి ఐఎఎస్ అని కూడా చూడటం లేదు, కనీస మర్యాద కూడా లేకుండా.. చూద్దాంలే, చేద్దాంలే... అని అంటున్నారు, అందుకని నేను అక్కడికి వెళ్లలేను...' అంటూ తన అశక్తతను వ్యక్తం చేశారని తెలిసింది.

భూములు లాక్కుంటే ప్రతిఘటిస్తాం

- ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తాం
- 2013 భూసేకరణ చట్టం ప్రకారమే పరిహారమివ్వాలి
- ప్రజాప్రతినిధులు, ధనికులు, వ్యాపారుల కోసమే అలైన్‌మెంట్ మార్పు : జాన్‌వెస్లీ
- హెచ్ఎండిఎ కార్యాలయం వద్ద భూనిర్వాసితుల ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం బలవంతంగా భూములను లాక్కుంటే ప్రతిఘటిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామసభలను నిర్వహించి రైతుల ఆమోదంతోనే భూములను సేకరించాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేకుండా భూమిని తీసుకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని అన్నారు. ఇదే వైఖరి కొనసాగిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా ఏకమై తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. 2013 చట్టంలోని షెడ్యూల్-1లో చూపిన విధంగా మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, ఫార్మా సంస్థల యాజమానులు, ధనికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే అలైన్‌మెంట్‌లో ప్రభుత్వం మార్పులు చేస్తున్నదని విమర్శించారు. పేదల భూముల నుంచే వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నిర్వాసితులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలైన్‌మెంట్ మార్పు, భూసేకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, వ్యాపారులు, ధనికులు భూమి కోల్పోకుండా చిన్న రైతులు, పేదల భూములను మాత్రమే తీసుకునేలా అలైన్‌మెంట్‌ను మారుస్తున్నారని విమర్శించారు. పోలీసులను ఉపయోగించి రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు ప్రకటించి హద్దులు పెడుతున్నారని అన్నారు. భూమి ఇవ్వడానికి సిద్ధంగా లేరని చెప్పారు. తరతరాలుగా ఆ భూమిపై ఆధారపడి బతుకుతున్నారని వివరించారు. అయినా బలవంతంగా ఆ భూమిని తీసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. రైతులకు తెలియకుండానే భూమిని తీసుకుంటున్నదని చెప్పారు. భూమికి భూమి ఇవ్వాలనే నిబంధనను పట్టించుకోవడం లేదన్నారు. 2013 చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదని చెప్పారు. ఎకరా రూ.పది కోట్లు, రూ.ఐదు కోట్లు ఉంటే ప్రభుత్వం రూ.పది లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 కోట్లు పరిహారం ఇస్తున్నదని వివరించారు. రైతుల ఆమోదం లేకుండా సెంటు భూమి తీసుకున్నా సహించేది లేదన్నారు. గ్రామసభలు జరిపి రైతుల ఆమోదం ఉంటేనే తీసుకోవాలని కోరారు. ఆర్ఆర్ఆర్ తర్వాత రింగ్ రైలు వస్తుందంటున్నారనీ, దానికోసం భూసేకరణ అవసరమవుతుందని వివరించారు. ఆ భూములన్నీ వ్యవసాయ యోగ్యమైనవనీ, పంటలు పండుతాయని అన్నారు. రైతులకు అన్యాయం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. రైతులతో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్చలు జరపం, నిర్బంధం ప్రయోగిస్తామంటే గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికీ పడుతుందని చెప్పారు. రైతులకు, నిర్వాసితులకు, ఆ భూములకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులను సంఘటితం చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

ఢిల్లీ తరహా రైతాంగ ఉద్యమం నిర్మిస్తాం : టి సాగర్

అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్ మాట్లాడుతూ అలైన్‌మెంట్‌పై రైతుల అభిప్రాయాలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్, భూసేకరణకు సంబంధించి తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని కోరారు. ఏ ఒక్క రైతు కూడా అన్యాయానికి గురైతే సహించేది లేదన్నారు. భవిష్యత్‌లో ఢిల్లీ తరహాలో రైతాంగ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు పదవుల్లో ఉండే అర్హత లేదు : ఎండి జహంగీర్

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ ఒఆర్ఆర్ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఆర్ఆర్ఆర్ ఉంటుందనీ తొలుత ప్రకటించారని, ఇప్పుడు 28 కిలోమీటర్లకు, 25 కిలోమీటర్లకు ఎందుకు తగ్గిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఫార్మా సంస్థల అధినేతలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములు పోతున్నందుకే అశాస్త్రీయంగా అలైన్‌మెంట్‌ను మార్చారని విమర్శించారు. రైతుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ఆ పదవిలో ఉండే అర్హత లేదన్నారు. పదవులకు రాజీనామా చేస్తారా?, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పాత అలైన్‌మెంట్‌ను అమలు చేస్తారా? తేల్చుకోవాలని సవాల్ విసిరారు. సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్‌ను వంకర టింకరగా ఎందుకు తిప్పుతున్నారో అర్థం కావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్పొరేట్ల బిడ్డవా? ధనికుల బిడ్డవా? లేదంటే పేదల బిడ్డవా? తేల్చుకోవాలని అన్నారు. సిపిఎం సిద్ధిపేట జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులతో పెట్టుకున్న ప్రభుత్వాలకు పుట్టగతులుండబోవని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ వెంకట్రాములు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ డిమాండ్లను తీసుకెళ్తామని చెప్పారు. హెచ్ఎండిఎ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి ధర్నా శిబిరం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను సిపిఎం నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాం నాయక్, బి ప్రసాద్, కొండమడుగు నర్సింహ్మ, ప్రజాసంఘాల నాయకులు కోట రమేష్, ఎం శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ కోసం గ్రామసభలను నిర్వహిస్తాం : రవీందర్‌రెడ్డి

ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను తయారు చేసి హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌లో పొందుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించిందని హెచ్ఎండీఏ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి చెప్పారు. అలైన్‌మెంట్‌పై వచ్చిన అభ్యంతరాలు, సూచనలను క్రోఢీకరించి ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ఉత్తర భాగం పూర్తయ్యిందనీ, దక్షిణ భాగం ప్రభుత్వానికి పంపిస్తామని వివరించారు. భూసేకరణ వరకు ఇంకా వెళ్లలేదన్నారు. అలైన్‌మెంట్‌పై పబ్లిక్ నోటీసు ఇచ్చామని అన్నారు. గ్రామసభలు భూసేకరణ ప్రక్రియలో ఉంటాయన్నారు. ఈ వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు.

సిఎంతో చర్చించాకే ఎఐసిసికి అభ్యర్థుల లిస్ట్

- మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డితో చర్చించిన తర్వాతే జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల కోసం అభ్యర్థుల జాబితాను ఎఐసిసికి పంపించనున్నట్టు టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో టికెట్ ఖరారు కావొచ్చన్నారు. ఉప ఎన్నికల టికెట్ బిసికి వచ్చే అవకాశముందన్నారు. ఉప ఎన్నికలో ముగ్గురు ఇన్‌ఛార్జి మంత్రుల రిపోర్టు ఆధారంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక మాదిరిగానే జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక గెలిచి తీరుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వానికీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రజా పాలనకూ తేడా సుస్పష్టంగా ఉందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలను వక్రీకరించారని, అసత్య ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. డిసెంబర్ చివరి నాటికి పార్టీ పదవులన్నింటినీ భర్తీ చేస్తామని తెలిపారు. త్వరలోనే కామారెడ్డిలో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో టిపిసిసి వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముగ్గురు మంత్రులతో కలిసి జూబ్లీహిల్స్‌లో బస్తీ బాట చేపడుతున్నట్టు తెలిపారు. ఎంఐఎం పార్టీ తమ ఫ్రెండ్లీ పార్టీ అనీ, ఆ పార్టీ మద్దతు తమ అభ్యర్థికే ఉంటుందన్నారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కోసం అన్ని వర్గాలు సహకరించాలి

- టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కోసం అన్ని వర్గాలు సహకరించాలని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును కోర్టు కొట్టి వేయడం శుభ పరిణామంగా పేర్కొంటూ స్వాగతించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ పార్టీ అన్ని రకాలుగా పోరాడి సాధిస్తుందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం మూడు చట్టాలు, ఒక ఆర్డినెన్స్, ఒక జిఒ ఇచ్చి వాటిని అమలు చేసేందుకు కృషి చేసిందని గుర్తుచేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి ఇన్‌ఛార్జీ మీనాక్షి నటరాజన్ కూడా అమలు కోసం నిరంతరం ప్రయత్నిస్తుందని తెలిపారు. ఈ నెల 8న హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

బిజెపి, బిఆర్ఎస్‌ల కుట్ర : చనగాని దయాకర్

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా బిజెపి, బిఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టులో మాధవ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, పిటిషన్ల వెనుక కేటీఆర్ హస్తం ఉందని దుయ్యబట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు రిజర్వేషన్ల వ్యతిరేకి అని విమర్శించారు. బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకే రాష్ట్ర ప్రభుత్వం జీవో తెచ్చిందని స్పష్టం చేశారు.

కేంద్రం పెండింగ్ పెడితే నిర్ణయం తీసుకున్న హక్కు రాష్ట్రానిదే
రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి చైర్మన్ డాక్టర్ రియాజ్

కేంద్రం దగ్గర బిల్లులు 90 రోజులు పెండింగ్‌లో ఉంటే నిర్ణయం తీసుకునే హక్కు రాష్ట్రాలకు ఉందని రాష్ట్ర కేంద్ర గ్రంథాలయానికి చైర్మన్ డాక్టర్ రియాజ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి రేవంత్ సర్కార్ తెచ్చిన జిఒ చట్టబద్ధమైనదిగా భావిస్తున్నట్టు సుప్రీంకోర్టు సిజె గవాయ్‌పై దాడి పిరికిపందల చర్య అని ఖండించారు.

జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడికి టిఎస్‌యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడికి ప్రయత్నించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుల దురహంకారం, మత అసహనం నేడు దేశమంతటా రాజ్యమేలుతున్నాయని విమర్శించారు. రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల ఏ మాత్రం గౌరవం లేని అనాగరిక, అసాంఘిక శక్తులు విచ్చలవిడిగా విజృంభిస్తున్నాయని తెలిపారు. వాటిని కట్టడి చేయాల్సిన పాలకులు ప్రత్యక్షంగానో పరోక్షంగానో వారిని ప్రోత్సహిస్తూ ఉండటం ఆందోళన కలిగిస్తున్నదని పేర్కొన్నారు. సీజేఐపై కోర్టు హాల్‌లో బూటుతో దాడికి ప్రయత్నించిన అడ్వకేట్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

ఆ ఉన్మాదిని కాల్చిచంపాలి : టిఎస్‌పిటిఎ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడిచేయడానికి యత్నించిన ఉన్మాద న్యాయవాది రాకేశ్ కిషోర్‌ను బహిరంగంగా కాల్చిచంపాలని టిఎస్‌పిటిఎ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ షౌకత్‌అలీ, ఉప ప్రధాన కార్యదర్శి రోహిత్‌నాయక్ రాష్ట్రపతిని డిమాండ్ చేశారు. దేశంలో 12 ఏళ్లుగా మతోన్మాద శక్తులు వ్యాపింపజేస్తున్న ఉన్మాద, విద్వేష, విధ్వంసక వైరస్ ఫలితమే ఈ క్రూరమైన ఘటనకు ప్రేరేపితమని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన న్యాయమూర్తిపైనే దాడికి యత్నించారంటే దాని వెనుక పెద్దల హస్తం లేకుండా జరగబోదని పేర్కొన్నారు. ఆ శక్తులేవో రాష్ట్రపతి నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. విద్వేష, ఉన్మాద, విధ్వంస చర్యలకు పాల్పడే వారికి మరణశిక్ష విధించేలా ఆర్డినెన్స్‌ను విడుదల చేయాలని కోరారు.

జస్టిస్‌పై దాడి హేయం : కూనంనేని

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై జరిగిన దాడి హేయమైనదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. న్యాయవ్యవస్థను తమకు అనుకూలంగా వ్యవహరించే విధంగా బెదిరించేందుకే ఈ దాడి చేశారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయ్‌పైనే నిండు కోర్టులో ఒక న్యాయవాది దాడి చేసే ప్రయత్నం అత్యంత దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. ఈ దాడిపై లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకుని న్యాయవ్యవస్థ స్వతంత్రతను, దేశ లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవశ్యకత ఉందని సూచించారు.

మైనర్ల ట్రాప్‌హౌస్ పార్టీ, హుక్కా స్థావరం

- ఇన్‌స్టాలో పరిచయంతో సెలబ్రేషన్స్ చేసుకున్న 65 మంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని ఓ ఫామ్‌హౌస్‌లో మైనర్ల ట్రాప్‌హౌస్ పార్టీ నిర్వహించారు. ఇన్‌స్టాలో పరిచయంతో 65 మంది కలిసి సెలబ్రేషన్స్ చేసుకున్నారు. పక్కా సమాచారం అందుకున్న ఎస్ఒటి పోలీసులు దాడులు నిర్వహించి, 59 మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో కేసులో రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి పిఎస్ పరిధిలోని హుక్కా స్థావరంపై ఎస్ఒటి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పది మందిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కెనడా నుంచి హైదరాబాద్ వచ్చిన ఇషాన్ అనే వ్యక్తి జల్సాలకు అలవాటు పడ్డాడు. సెల్ఫ్ పార్టీలను కండక్ట్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ట్రాప్‌హౌస్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పేజ్ క్రియేట్ చేసి సుమారు 65 మందితో ఈ నెల 4న మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామ సమీపంలోని చెర్రీ అండ్ ఓక్స్ ఫామ్‌హౌస్‌లో పార్టీ ఏర్పాటు చేశారు. పక్కా సమాచారం అందుకున్న ఎస్ఒటి పోలీసులు ఫామ్‌హౌస్‌పై మెరుపు దాడి నిర్వహించారు. 65 మందిలో 59 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 22 మంది మైనర్లుగా గుర్తించారు. అందులో ఐదుగురు అమ్మాయిలు ఉండగా, 17 మంది అబ్బాయిలు. వీరికి డ్రగ్స్ టెస్ట్ చేయగా.. ఇద్దరికి గంజాయి పాజిటివ్ వచ్చింది. 8 విదేశీ మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. సూపర్‌వైజర్ ఠాకూర్ మనీష్, డిజె ప్లేయర్లు రమేష్, రోహిత్, ఫామ్‌హౌస్ ఓనర్ శేషగిరి, ఆర్గనైజర్ ఇషాన్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

హుక్కా స్థావరంపై దాడులు

మైలార్దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అద్దె గదిలో నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై ఎస్ఒటి పోలీసులు దాడులు చేసి పది మందిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... శాస్త్రీపురంలో శంషీర్ అనే ఒక వ్యక్తి గది అద్దెకు తీసుకుని కొంతకాలంగా హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. సోమవారం అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఒటి పోలీసులు దాడులు నిర్వహించారు. హుక్కా సేవిస్తున్న 9 మందితో పాటు నిర్వాహకుడు శంషీర్‌ని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 17 హుక్కా పాట్స్, హుక్కా ఫ్లేవర్స్ స్వాధీనం చేసుకున్నారు. పది మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

మిర్యాలగూడలో నిలిచిన హౌరా ఎక్స్‌ప్రెస్

- గంటకు పైగా నిలిచిన రైలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హౌరా నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సాంకేతిక లోపం కారణంగా సోమవారం ఉదయం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయింది. రైలు ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడటంతో రైల్వే అధికారులు రైలును మిర్యాలగూడలో నిలిపివేశారు. సుమారు గంటకు పైగా రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రామన్నపేట నుంచి మరో ఇంజిన్‌ను తెప్పించడంతో.. తద్వారా హౌరా ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌కు వెళ్లింది. కాగా దసరా పండుగ సెలవులను ముగించుకొని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రయాణికులు రైలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టిజిఐఐసి) సోమవారం నిర్వహించిన వేలంలో భూమికి రికార్డు ధర పలికింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం ధర రూ.177 కోట్లు చెల్లించారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని టిజిఐఐసి వేలం వేసింది. దీంట్లో పాల్గొన్న ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అత్యధిక ధరతో 7.6 ఎకరాల భూమిని సొంతం చేసుకుంది. ఎకరాకు రూ.177 కోట్ల చొప్పున మొత్తం రూ.1357 కోట్లకు చేజిక్కించుకుంది. తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో కూడా రికార్డు ధర నమోదైంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో రికార్డు స్థాయిలో చదరపు గజం రూ.1.14 లక్షలు పలికింది.

పేద పిల్లలను చదువుకు దూరం చేయడమే ఇందిరమ్మ రాజ్యమా?

- కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేద పిల్లలను చదువుకు దూరం చేయడమే ఇందిరమ్మ రాజ్యమా? అని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. రేవంత్ సర్కారు పేదింటి బిడ్డలను చదువులకు దూరం చేస్తున్నదని విమర్శించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో భాగంగా ప్రయివేటు స్కూళ్లలో చదువుతోన్న వేలాది మంది విద్యార్థుల ఫీజులు చెల్లించడం లేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ స్కీమ్ కింద నయా పైసా విడుదల చేయలేదని పేర్కొన్నారు ప్రభుత్వం ఫీజులు చెల్లించని కారణంగా విద్యార్థులను తరగతి గదుల్లోకి ఆ స్కూళ్ల యాజమాన్యాలు అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ, జగిత్యాల జిల్లా కేంద్రాల్లోని ప్రయివేటు స్కూల్ యాజమాన్యం దసరా సెలవుల తర్వాత వచ్చిన విద్యార్థులను క్లాసు రూముల్లోకి అనుమతించకుండా బయటనే ఉంచిందని ఉదహరించారు. ఫీజులు చెల్లిస్తే కానీ లోపలికి రానిచ్చేది లేదని యాజమాన్యాలు తేల్చిచెప్పాయని గుర్తుచేశారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో స్కూళ్లను నడపలేకపోతున్నామని, ప్రభుత్వం ఫీజులు చెల్లించకుంటే విద్యార్థుల తల్లిదండ్రులే ఆ భారం మోయాలని కోరుతున్నారని తెలిపారు. తమ గోడు చెప్పుకునేందుకు జగిత్యాల కలెక్టరేట్‌కు వెళ్లిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఉపశమనం దక్కలేదని వెల్లడించారు. ఫీజుల కోసం డిప్యూటీ సిఎంను కలిసి విన్నవించుకోవాలని కలెక్టరేట్ సిబ్బంది సలహా ఇచ్చారని తెలిపారు.

తేల్చుకున్నాకే తెలంగాణ రండి
సిఎం బెంగుళూరు పర్యటనపై కవిత

దక్షిణ తెలంగాణకు చుక్క నీరు రాకుండా చేసే ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపుపై బెంగుళూరులో తేల్చుకున్నాకే తెలంగాణకు రావాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సిఎం రేవంత్ రెడ్డికి సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దక్షిణ తెలంగాణను ఎడారి చేసే ఆల్మట్టి ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి నోరు విప్పడం లేదని ఆమె విమర్శించారు. తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాలున్నాయని, కాంగ్రెస్‌కు హైకమాండ్ బిగ్‌బాస్ అని గుర్తుచేశారు. ఎఐసిసి అధ్యక్షులు ఖర్గేను ఒప్పించి, ఆయనతో కర్ణాటక ముఖ్యమంత్రికి స్పష్టమైన నిర్దేశం చేయించి ఆల్మట్టి ఎత్తు తగ్గింపుపై స్పష్టమైన ప్రకటనతో తెలంగాణలో అడుగుపెట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

ఇంజెక్షన్ వికటించి బాలుడు మృతి

- ఆర్ఎంపి ఇంటి ముందు ఆందోళన
- జడ్చర్ల మండలం లింగంపేట గ్రామంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జ్వరం వచ్చిందని ఆర్ఎంపి వద్దకు వెళ్తే.. ఆయన వేసిన ఇంజెక్షన్ వికటించి బాలుడు మృతి చెందాడంటూ బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్ల మండల పరిధిలోని కురపల్లి గ్రామానికి చెందిన కురుమయ్య- మాధవి దంపతుల చిన్న కుమారుడు వరుణ్ తేజ్ (11) కొడుగల్ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. బాలునికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం లింగంపేట గ్రామంలో ఓ ఆర్ఎంపి డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. వైద్యుడు బాలునికి ఇంజెక్షన్ వేశారు. గంట తర్వాత తల్లిదండ్రులు బాలుడిని ఇంటికి తీసుకెళ్లారు. అయితే, ఇంటికెళ్లిన కాసేపటికి బాలుడి ప్రవర్తన వింత ఉండటం.. మతిస్థిమితం లేని వాడిలా మాట్లాడటంతో వెంటనే జడ్చర్ల ఆస్పత్రికి, అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించారు. అక్కడి వైద్యులు ఆర్ఎంపీకి ఫోన్ చేసి ఏ ఇంజెక్షన్ ఇచ్చారు.. ఎందుకు వేశారని అడిగారు. బాలుడికి ఇంజెక్షన్ వికటించిందని, దీంతో బ్రెయిన్ ఎఫెక్ట్ అయిందని చెప్పారు. వెంటనే హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే బాలుడు పరిస్థితి విషమించి మృతిచెందాడు. దాంతో ఆదివారం రాత్రి బాలుని మృతదేహాన్ని కురవపల్లి గ్రామంలో ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం కుటుంబీకులు మృతదేహాన్ని తీసుకెళ్లి లింగంపేట గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ ఇంటి వద్ద పెట్టి ఆందోళనకు దిగారు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే ఆయన ఇచ్చిన ఇంజెక్షన్ వికటించి బాలుడు మృతిచెందాడని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రులది హడావిడే.. సాధించిందేమీ లేదు

- బిసిలపై చిత్తశుద్ధి ఉంటే హైకోర్టులో వాదనలు వినిపించాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో ఏదో సాధించామన్నట్టుగా రాష్ట్ర మంత్రులు ఢిల్లీలో హడావిడి చేయడం విడ్డూరంగా ఉందని, వారు సాధించిందేమీ లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో తాము జోక్యం చేసుకోలేమంటూ రిట్ పిటిషన్లను సుప్రీం కోర్టు డిస్మిస్ చేసిందని తెలిపారు. దానికి ఢిల్లీకెళ్లి ఏదో సాధించామన్నట్టు రాష్ట్ర మంత్రులు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టులో న్యాయనిపుణులతో వాదనలు వినిపించి బిసిలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కావాలని మొదటి నుంచీ కోరుతున్నామని, తమ పార్టీ దానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూనే పేద, మధ్య తరగతి ప్రజలపై చార్జీల భారం పెంచడం దారుణమని, ఒక చేతితో ఇచ్చి మరో చేతితో లాక్కోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలసీ అని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో పెంచిన బస్సు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికను మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ ఎంపి పి.రాములు, కోమల ఆంజనేయులు కమిటీ చేస్తుందనీ, ఇప్పటికే పార్టీ నాయకుల, ఆశావాహుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నదని తెలిపారు. ఆ ఉప ఎన్నికలో గెలవడమే లక్ష్యంగా ముందుకెళు_న్నామని చెప్పారు.

మళ్లీ పోటీ అంటేనే వణుకు!

- 'అప్పుల భారమే' అంటున్న మాజీ సర్పంచులు
- మరోమారు ఎన్నికల బరిలో నిలవాలంటేనే జంకుతున్న వైనం
- సర్పంచ్‌గా రూ.లక్షల్లో సొంత ఖర్చు.. ఇప్పటికీ ఆ బిల్లులన్నీ పెండింగే!
- పెండింగ్ బిల్లుల విడుదల కోసం ఆందోళనలు, ఆత్మహత్యాయత్నాలు..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎప్పుడెప్పుడా ఎదురు చూస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. అయితే త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందే గ్రామాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈసారి ఎన్నికల బరిలో నిలవడానికి మాజీ సర్పంచులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం చర్చనీయాంశమైంది. అక్టోబర్ చివరి వారం నుంచి మూడు విడతల్లో (అక్టోబర్ 31, నవంబర్ 4, నవంబర్ 8) జరగనున్న ఈ ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, పదవీకాలం పూర్తయిన మాజీ సర్పంచులు మళ్లీ పోటీ చేయాలా? వద్దా? అన్న మీమాంసలో ఉండిపోయారు. గతంలో పదవిలో ఉన్నప్పుడు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉండటం, సొంత డబ్బులు, అప్పులు చేసి పనులు చేసినా వాటికి సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో ఆర్థికంగా చితికిపోయి ఈసారి పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంటున్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం సొంత డబ్బులు, అప్పులు తెచ్చి పనులు చేసిన సర్పంచులు, బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. లక్షల్లో ఖర్చు చేసి గెలిచిన వారికి, చేసిన అభివృద్ధి ఖర్చులు కూడా తిరిగి రాలేదు. దీంతో చాలా మంది అప్పుల పాలై, ఆస్తులు అమ్ముకుని దయనీయమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఒక్కో చిన్న పంచాయతీకి కనీసంగా రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు, మేజర్ పంచాయతీలకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. కొన్ని పెద్ద పంచాయతీల్లో రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలో 318, జగిత్యాల జిల్లాలో 385, పెద్దపల్లి జిల్లాలో 266, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 260 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.1,200 కోట్లు బకాయిలు ఉంటే అందులో కేవలం కరీంనగర్ జిల్లాలోనే రూ.118 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయని మాజీ సర్పంచులు వాపోతున్నారు.

కంటికి కనిపించని 'అభివృద్ధి' బిల్లులు..
కన్నీళ్లు తెప్పిస్తున్న 'వడ్డీ' భారాలు!

ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ సర్పంచుల్లో చాలా మంది ఇప్పుడు అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం, లక్ష్మీదేవిపల్లి మాజీ సర్పంచ్ భర్త రూ.11 లక్షల బిల్లులు రాకపోవడంతో, అప్పుల బాధ తాళలేక మనస్తాపానికి గురై ఇటీవల గడ్డి మందు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ మాజీ సర్పంచ్ కుటుంబం ఇప్పటికే పది గుంటల వ్యవసాయ భూమితో పాటు బంగారాన్ని కుదువపెట్టి కొంత అప్పు తీర్చినా, మిగతా అప్పుకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడింది. ఒక్క లక్ష్మీదేవిపల్లి సర్పంచే కాదు.. చిగురుమామిడి మండలంలోని ఓ మాజీ సర్పంచ్ అప్పులు తీర్చే మార్గం లేక, తన భార్యతో కలిసి ఉపాధి హామీ (కూలీ) పనులకు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఇదే మండలంలోని మరో మాజీ సర్పంచ్ రెన్నెళ్ల క్రితం తనకున్న 30 గుంటల భూమిని అమ్మి రూ.22 లక్షల అప్పు చెల్లించాడు. ఇంకో రూ.11 లక్షల అప్పు ఇంకా మిగిలే ఉందంటూ తన సన్నిహితులతో వాపోతున్నాడు. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మెజార్టీ పంచాయతీల్లో ఏ ఒక్క 'మాజీ'ల పరిస్థితి చూసినా ఇలాగే ఉంది.

ఎన్నికల బరిలో అంటేనే భయం

పెండింగ్ బిల్లులన్నీ ప్రధానంగా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎస్ఎఫ్‌సీ) పద్దుల కింద చేసిన శాశ్వత అభివృద్ధి పనులకు సంబంధించినవే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా అది కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో, లక్షల్లో అప్పులు చేసి పనులు చేసి, వాటికి బిల్లులు రాక నష్టపోయిన మాజీ సర్పంచులు మళ్లీ ఎన్నికల బరిలో నిలవడానికి జంకుతున్నారు. ఎన్నికల కోసం భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఒకవేళ గెలిచినా అభివృద్ధి పనులకు సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తే పాత పరిస్థితే పునరావృతమవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాలకు ప్రాతినిధ్యం వహించిన మాజీ సర్పంచుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఇటీవల కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన చింతకుంట మాజీ సర్పంచ్‌కు రూ.75లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. తమ గ్రామం మున్సిపాలిటీలో విలీనం కావడం, రికార్డులు కూడా మున్సిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో తమ పెండింగ్ బిల్లులు రావడం మరింత కష్టమవుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.